# విపశ్యన మాసపత్రిక

VOLUME:13 NO - 04 1 JULY, 2018

(సాధకుల ప్రేరణ కొరకు ఉద్దేశించబడిన తెలుగు మాసపత్రిక)

విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, ధమ్మఖేత్త, వనస్థలిపురం, హైదరాబాదు – 70


"ధర్మవాణి"

ప

## శుద్ధ ధర్మాన్ని వ్యాపింపచేయటం, దాన్ని సజీవంగా ఉంచాలనే సంకల్పం

(ధమ్మ విముత్తి, ఖుషినగర్ (ఉత్తరప్రదేశ్) ధర్మయాత్రలో పూజ్య గురూజీ పాత సాధకులకు ఇచ్చిన ప్రవచనం – మే నెల తరువాయి భాగం.)

**నా ప్రియమైన విపశ్యన సాధకుల్లారా!**

బుద్ధ భగవానుని శిక్షణ మొత్తం వారి జీవితకాలంలోనే ఇతర దేశాలకు వెళ్ళింది. కానీ దాదాపు 250–275 సంవత్సరాల తరువాత అశోకుడు చక్రవర్తి అయ్యాక అతని గురువు మొగ్గలిపుత్త తిస్స థేరుడు మూడవ బుద్ధ సంగాయణం చేసినప్పుడు, అతడు ధర్మ దూతలను బుద్ధవాణి అంతా కంఠస్థమున్న అరహంతులను భారతదేశపు పొరుగుదేశాలకు పంపించాడు. వారితో పాటుగా ఈ విపశ్యన సాధన, ఈ విపశ్యన విద్య కూడా ఇతర దేశాలకు వెళ్ళింది. అలా ఈ విద్య బర్మా దేశానికి కూడా వెళ్ళింది. కానీ 500 సంవత్సరాలు గడవకముందే పరస్పర పోట్లాటలు, ఇంకా ఇతర కారణాలతో ఈ విద్య భారతదేశంలో లుప్తమైపోయింది. విపశ్యనతో పాటు బుద్ధవాణి కూడా భారతదేశంలో అంతరించిపోయింది. ఒకవేళ అశోక చక్రవర్తి, మొగ్గలిపుత్త తిస్స థేరుడు ఈ విద్యను ఇతర దేశాలకు పంపించి ఉండకపోతే ఇది శాశ్వతంగా కనుమరుగైపోయేది. ఇక మనకెలా దొరికేది? ప్రపంచ ప్రజలందరికీ ఎలా మేలు జరిగేది? కాబట్టే వాళ్ళకు మనం ఎంతో ఋణపడి ఉంటాం. ఈ విద్య వెళ్ళిన ఇతర దేశాల్లో అయిదు దేశాలు బుద్ధవాణిని భద్రపరిచాయి. ఇప్పుడు ఈ అయిదు దేశ ప్రజలను చూస్తే – అందరి ఉచ్చారణ వేరు వేరు. కానీ పాళీ మాత్రం అదే. అందరి లిపి కూడా వేరే. కొన్ని చిన్న చిన్న మార్పులే – ఎక్కడో 'ఇ' కి బదులుగా 'ఈ' ని ప్రయోగిస్తారు. ఇలాంటి సాధారణ తేడాలే కానీ మూలవాణిలో మాత్రం ఎలాంటి మార్పూ జరగలేదు. వారంతా ఈ సాహిత్యాన్ని ఎన్నో సంవత్సరాలుగా కాపాడుతూ వచ్చారు. కాబట్టి అదే ప్రామాణికం అయిపోయింది. దానితో ఇది నిజంగానే బుద్ధవాణి అనే నమ్మకం కుదురుతుంది. వాళ్ళు దీన్ని భద్రపరిచి ఉండకపోతే ఇది మనకెలా దొరికి ఉండేది? అలాగే ఈ విపశ్యన విద్య కూడా అన్ని దేశాలకూ వెళ్ళింది. కానీ అంతటా కనుమరుగైపోయింది. ఒక్క బర్మా దేశమే దీన్ని భద్రపరిచింది. అందుకే వారికి మనమెంతో ఋణపడి ఉంటాం. మన దేశంలోనూ ఇంకా ఇతర దేశాల్లోనూ ఉన్న నమ్మకం లేదా ఎవరో సత్పురుషుల భవిష్యవాణి ప్రకారం బర్మా (ఆ రోజుల్లో బర్మాలో ఎక్కువ బంగారం ఉన్న కారణంగా దాన్ని స్వర్ణభూమి అని పిలిచేవారు.) మాత్రమే ఈ విద్య అనే అమూల్య రత్నాన్ని భద్రపరుస్తుంది. మిగతా దేశాలన్నింటిలో ఇది కనుమరుగైపోతుంది. 2500 సంవత్సరాల తరువాత ఈ అమూల్య విద్యా రత్నము తన జన్మస్థానమయిన భారతదేశానికి తిరిగివస్తుంది. ఇక్కడి ప్రజలు ఎంతో ప్రసన్నతతో దీన్ని స్వీకరిస్తారు. అయితే ఈ వాణిని, విద్యను రెండిటినీ ఇలా శుద్ధరూపంలో ఉంచటానికి కూడా ఒక కారణం ఉంది. బుద్ధుని మరణవార్త వినగానే "సుభద్రుడు" అనే భిక్షువు తన అజ్ఞానం కారణంగా "ఆ ముసలాడు చనిపోయి మంచిపనయింది" అని ప్రకటించాడు. అతడలా అని ఉండకపోతే, ఈ వాణిని భద్రపరచాలి. లేకపోతే ఇటువంటి వ్యక్తులు దీన్ని కలుషితం చేస్తారు" అని ఎవరూ అలోచించి ఉండేవారు కాదు. ఇలా ఇదొక మహత్తర సంఘటన. అతడు చేసిన ఈ పనికి మనం అతని పట్ల కూడా కృతజ్ఞతా భావాన్ని కలిగి ఉంటాం. మరో గొప్ప విషయం ఏంటంటే కేవలం 500 సంవత్సరాల వరకే అయినా ప్రజలు ఈ విద్యను కాపాడుతూ వచ్చారు. ఫలితంగా ఎంతోమంది దేశ ప్రజలకు మేలు జరిగింది. ఎంతో మంది ప్రజలు ఈ విద్య ద్వారా లాభపడ్డారు.

ఈ విద్యతో దేశానికెంత లాభం చేకూరిందో తెలియజెప్పే సాక్ష్యాలు మనముందు ఉన్నాయి. సామ్రాట్ అశోకుడు తన ఒకానొక శిలాశాసనంలో ఇలా రాయించాడు – "నాకంటే ముందు ఎంతోమంది రాజులయ్యారు. ఎంతోమంది సామ్రాట్టులయ్యారు. వారందరూ వారి రాజ్య ప్రజల్లో ధర్మం మేల్కొనాలి అనే కోరుకున్నారు. ప్రజలు ప్రశాంత జీవనం గడపాలి. ధర్మబద్ధమైన జీవితం గడపాలి, పెద్దలను గౌరవించాలి, పిల్లల్ని ప్రేమించాలి. దానమివ్వాలనే భావన కలిగి ఉండాలి అనే కోరుకున్నారు. కానీ ఏ రాజూ సఫలుడు కాలేదు. అందరూ ఇదే కోరుకున్నారు. కానీ ఎవరూ అలా చేయలేకపోయారు." – "కానీ నేను సాధించాను." అని చెప్పాడు. అతడిలా రాయించాడంటే ఇది అబద్ధం కాదు. ఒకవేళ అబద్ధమే అయితే ప్రజలు అతని శిలాశాసనాన్ని విరగ్గొట్టి పడేసేవారు. కానీ ఆ శాసనం ఇన్ని సంవత్సరాలపాటు నిలిచే ఉన్నది కదా! అందుకే నేను

విజయం సాధించాను అని చెప్తాడు. మరి, అతనెలా విజయం సాధించాడు? మొదటిది, అతను ధర్మ అమాత్యులను నియమించాడు. అమాత్యులంటే మంత్రులు. ధర్మ అమాత్యులంటే, ధర్మాన్ని బోధించే వారని అర్థం. రాజ్యం తరపున ధర్మాన్ని నేర్పించే వీరు రాజ్యమంతటా తిరుగుతూ ధర్మాన్ని నేర్పిస్తూ ప్రజలు అర్థం చేసుకుంటున్నారా, లేదా? వాళ్ళు ధర్మాన్ని పాటించటంలో ఏలాంటి ఇబ్బందులున్నాయి? అని చూసేవారు. ఇది ఒక కారణం. అశోకుడు మరో చోట చెప్తాడు – "అరె, ఇదెంతో చిన్న కారణం. ఈ ప్రవచనాలతో ఎవరు మారతారు? కొద్దిసేపు మారినా మళ్ళీ అలానే ఉండిపోతారు. నా విజయానికి మూల కారణమేంటంటే నేను ప్రజలకు ధ్యానం చేయటం నేర్పించాను. విపశ్యన చేయటం నేర్పించాను." అయితే, కోట్లమంది జనాభా ఉన్న ఈ దేశంలో ఈ విద్య ఎలా వ్యాపింపచేయబడింది? ప్రజలకు ఇది ఎలా బోధించబడింది? అనే ఆశ్చర్యమేస్తుంది. ఇప్పుడు మళ్ళీ సమయం వచ్చింది, ఏదో ఒక విధంగా ఈ విద్య దేశమంతటా విస్తరించి ఎంతో మేలు జరుగుతుంది. అయితే మనకు ఎంతో ప్రేరణ కలిగించే విషయం ఏంటంటే ఈ విద్య పదిలంగా ఉంది. విపశ్యన భద్రంగా ఉంది. వాణి కూడా నిలిచే ఉంది. ఇది ఎక్కడో ఒకచోట నిలిచే ఉంటుంది. బర్మా దేశమంతటా కాకపోయినా, కొద్దిమందే అయినా గురుశిష్య పరంపర ద్వారా దీన్ని భద్రపరిచారు. మిగతా వారు వారి వారి కర్మకాండల్లో, రకరకాల మతనమ్మకాల్లో చిక్కుకుని ఉండేవారు. ప్రపంచంలో ఇదే జరుగుతుంది. లోకచక్రం ఇలానే నడుస్తుంది. ఏ కొద్దిమంది అయితే దీన్ని భద్రపరిచారో, వారందరికీ మనమెంతో ఋణపడి ఉన్నాము. ఈ మహాపురుషుడు ఇంత సుధీర్ఘయాత్రను ముగించిన ఈ స్థానానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఎన్నో జన్మల ప్రయాణం ఇక్కడ ముగిసింది. ***"నత్థిదాని పునబ్భవోతి"*** – ఇక నాకు పునర్జన్మ లేదు – అని ప్రకటించాడు. అతడు ముక్తుడయ్యాడు. దీనికి ముందు చేసిన సేవ, శ్రమ కారణంగా కోట్లాది ప్రజలకు మేలు చేకూరింది, చేకూరుతూనే ఉంటుంది. ఇలా ఈ ప్రాంతానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది.

నేనింతకు ముందు చెప్పినట్లుగా బుద్ధుడు – "మూడు నెలల తరువాత వచ్చే వైశాఖ పౌర్ణమి నాడు రాత్రి పూర్తవగానే నేను నా శరీరాన్ని త్యజిస్తాను." అని భవిష్యవాణి ప్రకటించాడు. ఇక్కడ ఒక ప్రశ్న తలెత్తుతుంది. అదేంటంటే, ఈ ధర్మ విరోధ శక్తులు ఎప్పుడూ ధర్మాన్ని సాగనీయకుండా అడ్డుపడుతూనే ఉంటాయి. వాటి నాయకుడిని "మారుడు" అంటారు. – ఈయన సంబుద్ధుడు కావటానికి ప్రయత్నిస్తున్నప్పుడు కూడా అలా సంబుద్ధుడు అవకుండా ఉండటానికి ఈ మారుడు ఎంతో ప్రయత్నం చేశాడు. ప్రజలు ఈ భవచక్రంలోనే పడి ఉండాలని మారుడు కోరుకుంటాడు. మహా అయితే ఏ దేవలోకంలోనో వెళ్ళిపోయి అక్కడున్న ఆనందాలను, భోగభాగ్యాలను అనుభవిస్తూ అక్కడే ఉండిపోవాలని కోరుకుంటాడు. ఈ ఈ పనులు చేస్తే నీకు దేవలోకం ప్రాప్తిస్తుంది. ప్రజలు అంతటితోనే సంతృప్తిపడాలి అనుకుంటాడు. ఎవరైనా దానితో కూడా సంతృప్తి చెందకపోతే బ్రహ్మలోకానికి పంపించేవాడు. ఇలా ధ్యానం చేస్తే బ్రహ్మలోకం దొరికిపోతుంది. అంటూ మారుడు ప్రజలను ఈ భవచక్రంలోనే ఉంచాలని కోరుకుంటాడు. ప్రజలు అన్ని లోకాలను దాటి పునర్జన్మ లేని స్థాయికి చేరుకోవటం అతనికి ఇష్టముండదు. కాబట్టి బుద్ధుడు సమ్యక్ సంబుద్ధుడు కాగానే మారుడు అతనితో, "ఇక నీవు ముక్తుడవయ్యావు, ఇక వదిలేయి. ప్రజలకు నేర్పించాలని ఎందుకు అనుకుంటావు?" అన్నాడు. దానికి బుద్ధుడు, "అరె! నేను ఇందుకోసం సమ్యక్ సంబుద్ధుడిని కాలేదు." అని చెప్పి ప్రజలకు నేర్పిస్తూనే పోయాడు. మరో సందర్భంలో మారుడు మళ్ళీ వచ్చి, "ఇప్పుడు ఎంతోమంది విద్యను నేర్చుకున్నారు. ఎంతోమంది మీ శిష్యులయ్యారు. ఇక పరినిర్వాణం తీసుకోండి." అని అన్నాడు. సమాధానంగా బుద్ధుడు, "లేదు, నాలుగు రకాల సంఘాలు – భిక్షు సంఘం, భిక్షుణి సంఘం, గృహస్థుల్లో ఉపాసక సంఘం, ఉపాసిక సంఘం – నాలుగు సంఘాలు స్వయంగా ధర్మంలో పరిపక్వత చెందటమే కాకుండా ఈ నాలుగు సంఘాలు కూడా ధర్మాన్ని నేర్పించగలిగే స్థాయికి చేరుకుని అలా నేర్పిస్తున్నారని నాకు నమ్మకం కలిగితే, నేను పరినిర్వాణం తీసుకుంటాను." అని అన్నాడు. ఇక బుద్ధుడు వైశాలిలో పరినిర్వాణం చెందటానికి మూడు నెలల ముందు మారుడు మళ్ళీ వచ్చి "ఇక మీరు కోరుకున్నట్లుగా ఎంతో మంది తయారయ్యారు కదా! భిక్షువులు కూడా స్వయంగా పరిపక్వత చెందారు, ఇతరులకు కూడా నేర్పించగలవారు ఎంతోమంది తయారయ్యారు. భిక్షుణిలు కూడా స్వయంగా పరిపక్వత చెందారు. ఇతరులకు కూడా నేర్పించగలవారు ఎంతోమంది తయారయ్యారు, భిక్షుణిలు కూడా స్వయంగా పరిపక్వత ఉపాసకుల్లో స్వయంగా పరిపక్వత చెందటమే కాకుండా ఇతరులకు కూడా నేర్పించగలవారు ఎంతోమంది తయారయ్యారు, గృహస్త ఉపాసికుల్లో కూడా స్వయంగా పరిపక్వత చెందటమే కాకుండా ఇతరులకు కూడా నేర్పించగలవారు ఎంతోమంది తయారయ్యారు." అని చెప్తాడు. అప్పుడు బుద్ధుడు, "నీవు చెప్పింది నిజమే! సరే, ఈ రోజు నుంచి మూడు నెలల తరువాత పరినిర్వాణం తీసుకుంటాను." అని చెప్తాడు. దీనితో మనకొక విషయం స్పష్టంగా తెలుస్తోంది, బుద్ధుని మరణానికి ముందు నాలుగు సంఘాలూ పరిపక్వత చెంది ఉన్నాయి. దురదృష్టకర విషయం ఏంటంటే, కొద్దికాలం తరువాత గృహస్థుల్లో కొందరు ధ్యానానికి ప్రాముఖ్యతనివ్వటం తగ్గించేసి వారి వారి కర్మకాండల్లో నిమగ్నమైపోయారు. గృహస్త ఆచార్యులు కూడా దాదాపుగా కనుమరుగైపోయారు. అయితే దాదాపు వంద సవత్సరాల క్రితం ఎంతో దూరదృష్టి కల "లేదీ సయదా" ఇలా ఆలోచించాడు – "మరో వంద సంవత్సరాల తర్వాత బుద్ధ భగవానుని 2500 సంవత్సరాలు పూర్తవుతాయి. అప్పుడు ఈ విద్య భారతదేశానికి తిరిగి వెళుతుంది. ఆ తరువాత భారతదేశంలో స్థాపితమయి ప్రపంచమంతటా వ్యాపిస్తుంది." అని అతడు భారతదేశానికి వచ్చి ఇక్కడి పరిస్థితుల్ని చూసి "ఒకవేళ ఇక్కడికి ఎవరైనా సన్యాసి కానీ, భిక్షువు కానీ వెళ్లి బుద్ధుని శిక్షణ నేర్పిస్తే అరే, ఇది బౌద్ధ ధర్మం అని అంటారు. ప్రజల్లో ఈ బౌద్ధ ధర్మం మనకు పనికిరాదు అనే వెర్రితనం తలకెక్కించుకుని ఉన్నారు. కాబట్టి ఆచరించటం మాట అటుంచి కనీసం వినసైనా వినరు." అనే విషయం అర్థమయింది. అతడు తన దూరదృష్టితో "ఎవరైనా గృహస్థుడు వెళితేనే పని జరుగుతుంది. ఆ తరువాత అందరూ నేర్చుకునే సమయం వస్తుంది. మొదట ఎవరైనా గృహస్తులే వెళ్ళాలి. కానీ ఇంకా గృహస్థ ఆచార్యులు ఎవరూ లేరు. కాబట్టి నేను గృహస్థ ఆచార్యులను తయారు చేయాలి." అని ఆలోచించాడు. అలా దాదాపు 100–125 సంవత్సరాల క్రితం ఈ ఆలోచన అతనికి తట్టింది. దానితో అతడు "నీవు కూడా విపశ్యన నేర్చుకో" – అని

గృహస్థులకు కూడా తలుపు తెరవటంతో అతనికెంతో ఋణపడి ఉంటాం. అలా ప్రజలు విపశ్యన నేర్చుకోవటం మొదలుపెట్టారు. కేవలం కొద్దిమందే అయినా నేర్చుకోవటం మొదలుపెట్టారు. అలా వారిలో నుండే ఒక ఆదర్శ గృహస్థ ఆచార్యుడు తయారయ్యాడు. అతడే "సయా తేట్జీ". అతడొక ఆదర్శాన్ని స్థాపించాడు. గృహస్థుడు విపశ్యన ఆచార్యుడైతే ఎలా ఉండాలి? వారి జీవనం ఎలా ఉండాలి? అని నేర్పించాడు. అతడి శిష్యుడే నా ధర్మపిత "సయాజీ ఊ బా ఖిన్". అతడు కూడా ఎంతటి మంచి సాధుపురుషుడు!. అలా ఇది గృహస్థుల పరంపర అయిన కారణంగా భారతదేశం ఈ విద్యను స్వీకరించింది. అంటే దానర్థం భిక్షువులు నేర్పించలేరని కాదు. కానీ భారతీయుల మనసులో ఎన్నో అపోహలుంటాయి. నేను కూడా ఆ భ్రాంతుల వలలో చిక్కుకుని ఉండేవాడిని. 32 సంవత్సరాల వయసులో నా మొదటి శిబిరం పూర్తవగానే, ఇందులో ఎలాంటి లోపమూ లేదు, ఎలాంటి దోషము లేనిది, ఎలాంటి కళంకము లేనిది, ఎంతో మేలు చేసే విద్య అని అర్థం చేసుకున్నాను. అయినా దీనికి వ్యతిరేకంగా ఎక్కడాలేని పనికిరాని మాటలు ఎందుకు వస్తున్నాయి? మనదేశంలో అతని శిక్షణను అర్థం చేసుకోకుండా అతనికి వ్యతిరేకంగా ఎన్నో విషయాలు వ్యాప్తిచెందాయి లేదా పరస్పర పోట్లాటల కారణంగా నిరాధారమైన మాటల్ని ప్రచారం చేశారు. వారు చేస్తున్న నిందలకు ఎలాంటి ఆధారమూ లేదు బుద్ధవాణి అధ్యయనం ద్వారా అర్థం చేసుకున్నాను.

మన దగ్గర ఒక సామెత ఉంది. దానర్థం – విషయాన్ని పెద్దది చేస్తూ చేస్తూ నువ్వు గింజను తాటికాయంత చేసేశారు, ఆవగింజను పర్వతం చేసేశారు అని. నేను అధ్యయనం చేసి చూస్తే, అరె! ఇక్కడ ఎలాంటి నువ్వు గింజ కూడా లేదే, మరి తాటికాయ ఎలా తయారయ్యింది? ఇక్కడ ఆవ గింజ కూడా లేదే, మరి పర్వతం ఎలా తయారయ్యింది? అని అనిపించింది. మరి ఇన్నేళ్ళు ఈ విషయాలన్నీ తెలీకుండా ఉండిపోవటం మన దురదృష్టం. ఇప్పుడు ఈ విద్య మళ్ళీ తిరిగి రావటం మంచిదే, ప్రజలు దీన్ని స్వీకరించారు. ఈ సాధన చేయటానికి రాలేని వాళ్ళలోని అనుమానాలింకా మిగిలే ఉన్నాయి. కానీ శిబిరాలకు వచ్చిన వాళ్ళు మాత్రం అరె! ఇది ఎంతో పరిశుద్ధంగా ఉందే, ఇందులో "ఈ దోషముంది" అని వేలెత్తి చూపించటానికి ఏది లేదు అని అర్థం చేసుకుంటారు. అరె, శీల – సదాచారాలను నేర్చుకున్నాం, వాటిని తప్పుపట్టే ధర్మ పరంపరలేవీ లేవు ప్రపంచంలో. ఇతడు శీల–సదాచాలను నేర్పిస్తాడు. వాటిని పాటించటానికి మనసును వశపరుచుకోవటాన్ని నేర్పిస్తాడు. దీన్నెవరు తప్పుపడతారు? మరి మనసును వశపరుచుకోవటానికి ఉన్న ఆధారం కూడా శ్వాసనే. శ్వాస అందరికీ ఒకేలా ఉంటుంది. ప్రతి ఒక్కరూ దాన్ని అభ్యాసం చేయవచ్చు. అలాగే కేవలం మనసును వశపరుచుకోవటమే కాదు, మనసును వాటి వ్రేళ్ళ వరకూ నిర్మలం చేసుకోవాలి. అలా చేసుకోవటానికి ప్రజ్ఞను నేర్పిస్తారు. శరీరచిత్తాల పరస్పర సంబంధాల కారణంగా ఏర్పడ్డ సంవేదనల ఆధారంగా వికారాలు ఎలా పుడతాయి, అలాగే సంవేదనల ఆధారంగా వికారాలను ఎలా నిర్మూలించుకోగలము. ఇదే ప్రజ్ఞ. దీన్ని కూడా అందరూ ఒప్పుకుంటారు. ఆ వ్యక్తి హిందువైనా, ముస్లిమైనా, బౌద్ధ మతస్థుడైనా, జైనుడైనా, క్రిష్టియనైనా ఏలాంటి తేడా లేదు. భారతీయుడైనా, పాకిస్థానీ అయినా, బ్రిటిష్ అయినా, అమెరికన్ అయినా ఏలాంటి తేడా లేదు. మనిషి – మనిషే. అందరి స్వభావమూ ఒకేలా ఉంటుంది. మన స్వభావాన్ని మార్చుకుని మంచి జీవనం ఎలా జీవించాలి – దీన్ని అందరూ స్వీకరిస్తారు. ఈ వ్యక్తి ఈ మూడు విషయాలను మినహాయించి మరింకేదీ నేర్పించలేదు. అయినా అతడు చెప్పాడు అని ఎన్నో విషయాలు జోడించేశారు, ఎన్నో విషయాలు కలిపేశారు. మంచిదయింది, ఇప్పుడు అసలు విషయమేంటో ప్రజలకు మెల్లమెల్లగా తెలుస్తోంది. అవన్నీ వ్యర్థపు మాటలు, వీటి వల్లనే దేశం గత 2000 సంవత్సరాలుగా ఈ విద్యనుండి దూరమయిందని అర్థం చేసుకుంటున్నారు, మంచిదే. ఇక్కడే సుభద్ర అనే వ్యక్తి మనసులో భగవానుని నుండి ఈ విద్యను నేర్చుకోవాలనే సంకల్పం పుట్టింది, మంచిదే. దానితో అతనికొకడికే మేలయింది. అయితే, "ముసలాడు చనిపోయి మంచిదయింది, మనం ముక్తి పొందాం, ఇక మనకిష్టమొచ్చినట్లు చేసుకోవచ్చు." అని ప్రకటించిన ఆ ఇంకో సుభద్రుని కారణంగానే ఈ విద్య భద్రపరచబడింది. పరియత్తితో పాటు పతిపత్తి కూడా భద్రపరచబడింది. అంటే బుద్ధవాణి మరియు విపశ్యన విద్య – రెండూ నిలిచి ఉన్నాయి. వాటితోనే మనకెంతో మేలయింది. అందుకే ఈ స్థానానికి తనదైన విశిష్టత ఉంది. ఈ మహత్తర స్థానంలో ధ్యానం చేసుకుని మనం కూడా లాభం పొందుదాం.

భవతు సబ్బ మంగళం, భవతు సబ్బ మంగళం, భవతు సబ్బ మంగళం

సాధు, సాధు, సాధు

సుఖంగా ఉండండి, సుఖంగా ఉండండి, సుఖంగా ఉండండి

కళ్యాణ మిత్రుడు,
సత్యనారాయణ గోయంకా.

## సత్య ధర్మాన్ని మేల్కొలుపుకోవటం

ప్రియమైన సాధకులారా, సాధికలారా!

చూడండి! సత్య – ధర్మ కాంతి వ్యాప్తి చెందడం మొదలయింది. పాపమనే అంధకారం తొలిగిపోయే సమయం ఆసన్నమయింది. రండి! ఈ మంగళకరమైన ధర్మం జాగృతమైన ఈ సమయం నుండి లాభం పొంది మన అంతర్మనసును ధర్మకాంతులతో నింపుకుందాం. మన లోపల నిండి ఉన్న అంధకారాన్ని, కల్మషాలను పూర్తిగా దూరం చేసుకుందాం.

మన అంతర్మనసు లోలోతుల్లో నిండి ఉన్న రాగ ద్వేష మోహాలను దూరం చేసుకుందాం. రాగ ద్వేష మోహాలే పాపపు అంధకారాలు. వీటిని దూరం చేసుకోవటమే ధర్మప్రకాశం. గతంలో మనం చేసుకున్న గొప్ప పుణ్యం కారణంగా మన అంతర్మనును శుభ్రపరచుకుని సత్య–ధర్మ పవిత్రతను ధారణ చేసుకోగల ఇలాంటి సహజమైన, సరళమైన మార్గం దొరికింది. రండి! ఈ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగపరచుకుందాం.

ఈ మార్గంలో నడవడానికి మనల్ని మనం బౌద్ధులమని చెప్పుకోవలసిన అవసరం ఏమాత్రం లేదు. మనల్ని మనం బౌద్ధులమని చెప్పుకున్నా చెప్పుకోకపోయినా, మనం ఆ అత్యంత కారుణ్యమూర్తి, తథాగతుడు అయిన బుద్ధ భగవానుడు బోధించిన సహజమైన, సరళమైన విధానాన్ని అనుసరించి మనలోని రాగ ద్వేష మోహాల కల్మషాలను దూరం చేసుకుంటే మన హిత సుఖాలున్నాయి. అలా మనం ఈ కల్యాణకరమైన మార్గానికి మనం నిజమైన అనుచరులం, దు:ఖ నిరోధగామిని ప్రతిపదలో నిజమైన బాటసారులమయి అన్ని దు:ఖాల నుండి ముక్తి పొందడానికి నిజమైన అర్హత కలిగి ఉంటే మనల్ని మనం ఏ పేరుతో అయినా పిలుచుకోవచ్చు.

నిజమైన ధర్మమేమిటో తెలియనప్పుడే మనం హెచ్చుతగ్గులనే గోడలు తయారుచేసుకుని మనిషి మనిషికీ మధ్య విభజన పుట్టించుకుంటాము. నిజమైన ధర్మం ఈ గోడలను కూలగొట్టి అన్ని రకాల హెచ్చుతగ్గులను తొలగిస్తుంది. ఏకత్వమనే ధరాతలంపై కులమతాల హెచ్చుతగ్గులనే బేధ భావాలు లేనటువంటి మానవీయ సమాజాన్ని నిర్మిస్తుంది. ఒకవేళ ఏవైనా బేధ భావాలున్నా అవి ఎవరు ఎంతటి శీలవంతులు, ఎతంటి సమాధివంతులు, ఎంతటి ప్రజ్ఞావంతులు? అనే తేడాలే ఉంటాయి. కానీ ఈ విబేధాలు కూడా శాశ్వతం కాదు, మార్పులేనిది కాదు. ఏదో బాహ్య శక్తి చేత నిర్మించబడినవి కాదు. ప్రతి మనిషి కూడా తన స్వీయ ప్రయత్నంతో వీలయినంత ఎక్కువ శీలవంతుడయ్యి శరీరంతో, చేతలతో చేసే దుష్కర్మల నుండి దూరంగా ఉంటూ వీలంయినంత ఎక్కువ సమాధివంతుడయి తన మనసును వశపరచుకుని వీలయినంత ఎక్కువ ప్రజ్ఞావంతుడయి తన మనసులో రాగ ద్వేష మోహాల రూపంలో ఉన్న మలినాల నుండి విముక్తి పొందగల సామర్థ్యాన్ని కలిగి ఉంటాడు. సమతలో లేని వారికి సమత్వాన్ని పొందే పూర్తి అధికారం ఉంది, సంపూర్ణ సౌకర్యం ఉంది.

శీల, సమాధి, ప్రజ్ఞలలో పూర్తిగా ప్రతిష్ఠాపితం అయిన వ్యక్తి తన స్వభావం కొద్దీ మైత్రీ, కరుణలనే బ్రాహ్మిక గుణాలతో పరిఢవిల్లుతాడు. అలాంటి వ్యక్తి యొక్క మనసులో ద్వేష దర్భావనలు, అహంకారము, ద్వేషము, భయము, పిరికితనాలు ఎంత మాత్రమూ నిలవలేవు. అతడు తన జాతి, వర్ణము, కులము మరియు ధనము ఉన్నాయనే గర్వంతో అహంభావాన్ని పెంచుకోడు, అలాగే అవి లేనప్పుడు హీన భావాన్ని కూడా పెంచుకోడు, ఏ జాతి, కులం, వర్ణం లేదా ఏ మతంలో పుట్టిన వ్యక్తి అయినా; ధనవంతుడైనా, పేదవాడైనా; పండితుడైనా, పామరుడైనా శీల సమాధి ప్రజ్ఞలలో ప్రతిష్ఠాపితుడైతే ఖచ్చితంగా అతుడ పరిపూర్ణ మానవుడు అవుతాడు, మహనీయుడవుతాడు.

రండి! మానవత్వముకు నిజమైన ఈ కొలమానంతో మనల్ని మనం కొలుచుకునే అలవాటును పెంచుకుందాం, ఎప్పుడైనా మీ శీల, సమాధి, ప్రజ్ఞలలో ఏ మాత్రం వెలితి కలినిపించినా వాటిని బలపరుచుకునే ప్రయత్నం చేస్తూ మీ నిజమైన శ్రేయస్సును సాధించుకోండి.


రెండు సంవత్సరాలకు చందా రూ **100/-** **విపశ్యన తెలుగు మాసపత్రిక** జీవిత చందా రూ. **500/-**

ప్రచురణ తేది: ప్రతినెల **30/31** పోస్టింగ్ తేది: ప్రతి నెల **1/2** వెల: రూ **5/-**

**విపశ్యన అంతర్జాతీయ ధ్యానకేంద్రం, నాగార్జున సాగర్ రోడ్, వనస్థలిపురం, హైదరాబాదు - 500 070. ఫోన్ : 24240290 (ధ్యానకేంద్రం)**

**ఆఫీసు పని చేయు వేళలు : ఉదయం 9గం॥ల నుండి సాయంత్రం 5 గం॥ల వరకు**

Postal Reg. HSE 864/2016-2018 RNI Reg. No. APTEL/2006/17745

**PRINTED MATTER**

If Undelivered please return to :

**VIPASSANA INTERNATIONAL MEDITATION CENTRE,**
12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram,
HYDERABAD - 500 070.
Website : www.vri.dhamma.org
E-mail : info@khetta.dhamma.org

Published for Vipassana International Meditation Centre, 12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram, Hyd.(A.P)-70 Ph: 040-24240290, Published by Smt. Sabrina Katakam. Editor : Sri G.V.Subrahmanyam., Printed at Sai Likhita Printers, #6-2-959, Dakshin Bharat Hindi Prachar Sabha Complex, Khairatabad, Hyd. Ph : 2332579.